సాక్షి మంచిర్యాల

గురువారం : 25 : జనవరి : 2024

వాహనదారులకు అభినందన

మంచిర్యాలరూరల్(హాజీపూర్): రోడ్డు భద్రత నిబంధనలు పాటిస్తూ హెల్మెట్, సీట్‌బెల్ట్ ధరించిన వాహనదారులకు రవాణా శాఖ అధికారులు గులాబీ పువ్వులు అందిస్తూ అభినందించారు. రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా వేంపల్లి జాతీయ రహదారిపై బుధవారం రవాణా శాఖ అధికారులు రోడ్డు భద్రత ప్రచారం నిర్వహించారు. డీటీఓ కిష్టయ్య, ఎంవీఐలు వివేకానంద్‌రెడ్డి, రాహుల్‌కుమార్, ఏఎంవీఐ కొమ్ము శ్రీనివాస్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



అక్రమ కట్టడాల కూల్చివేత

మంచిర్యాలటౌన్: మంచిర్యాల బల్దియాలోని సర్వే నంబర్ 334 ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మించిన రెండిళ్లను మున్సిపల్, రెవెన్యూ, పోలీస్ బృందాలు బుధవారం కూల్చివేశారు. టీపీఎస్ శ్యాంసుందర్, రెవెన్యూ ఆర్‌ఐ అజీజ్ పోలీసుల సహకారంతో కూల్చేశారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
28.0 /17.0

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. ఉత్తరం దిశగా చలిగాలులు వీస్తాయి. గరిష్ట ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగే అవకాశం ఉంది. పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

వ్యవసాయశాఖలో అవినీతిపై విచారణ



విచారణ చేస్తున్న జెడ్పీ సీఈవో నరేందర్

చెన్నూర్‌రూరల్: వ్యవసాయ శాఖలో అవినీతి, ఆరోపణలపై సీఎంఓ నుంచి వచ్చిన ఆదేశాల మేరకు కలెక్టర్ విచారణకు ఆదేశించగా జెడ్పీ సీఈవో నరేందర్ బుధవారం క్షేత్రస్థాయిలో విచారణ జరిపారు. గత కొద్ది రోజులు వస్తున్న ఆరోపణలపై ఎంపీడీవో కార్యాలయంలో విచారించారు. చెన్నూర్‌తోపాటు మండలంలోని పలు ఫర్టిలైజర్ దుకాణాల్లో రికార్డులు, స్టాక్ ఇండెంట్, నిల్వలు, కేటాయింపు తదితర వివరాలు పరిశీలించారు. ఎరువుల ఇండెంట్లను ఎలా ఇచ్చారనే అంశాలపై క్షేత్రస్థాయి విచారణ అనంతరం అధికారులను వ్యక్తిగతంగా విచారించారు. సమగ్ర నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని సీఈవో నరేందర్ తెలిపారు. ఆయన వెంట సూపరింటెండెంట్ సత్యనారాయణ, సీనియర్ అసిస్టెంట్ గౌతమ్ ఉన్నారు.

ఇంచార్జి డీసీవోగా నర్సయ్య



నర్సయ్యను అభినందిస్తున్న ఉద్యోగులు

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లా సహకారశాఖ అధికారిగా నర్సయ్య బుధవారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లాలో పనిచేస్తున్న ఎల్.శ్రీనివాస్‌రెడ్డి పదోన్నతిపై హాకా జనరల్ మేనేజర్‌గా హైదరాబాద్‌కు బదిలీ కాగా నిర్మల్ జిల్లాలో డిప్యూటీ రిజిస్ట్రార్, ఆడిటర్‌గా పనిచేస్తున్న నర్సయ్యను జిల్లా సహకార శాఖ ఇంచార్జి అధికారిగా నియమిస్తూ రాష్ట్ర సహకార శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. బాధ్యతలు స్వీకరించిన డీసీవోకు కార్యాలయ అధికారులు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ జి.హన్మంత్‌రెడ్డి, డి.నరేష్, వై.శ్రీదేవి, రవీందర్ రావు, రవికిషోర్, సందీప్, ప్రసాద్‌రావు, జి.నితిన్‌కుమార్, నాగేశ్వర్, బి.సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

రక్తహీనత లేని జిల్లాగా మార్చాలి



పరీక్షలను పరిశీలిస్తున్న రాహుల్

మంచిర్యాలటౌన్: దేశం, రాష్ట్రంలోనే జిల్లాను రక్తహీనత లేని జిల్లాగా మార్చేందుకు వైద్య సిబ్బంది కృషి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ బి.రాహుల్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సాయికుంట ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలో బుధవారం 'ఎనిమియా ముక్త భారత్' కార్యక్రమాన్ని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఆర్‌బీఎస్‌కే బృందం ద్వారా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ అన్ని పాఠశాలల్లో ఆర్‌బీఎస్‌కే బృందం ద్వారా రక్తహీనతపై అవగాహన కల్పించడంతోపాటు విద్యార్థులను గుర్తించి చికిత్స అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సుబ్బరాయుడు, జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ అధికారి గంగారం, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అనిత, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ విజయనిర్మల, జిల్లా మాస్ మీడియా అధికారి బి.వెంకటేశ్వర్లు, పాఠశాల హెచ్‌ఎం సత్యనారాయణ పాల్గొన్నారు.

బాలికలు ఉద్యోగాలు సాధించి పేరు తేవాలి



మాట్లాడుతున్న జడ్జి అసదుల్లా షరీఫ్

లక్సెట్టిపేట: బాలికలు చదువుకునేందుకు ప్రభుత్వం అన్ని విధాలా సౌకర్యాలు కల్పిస్తోందని, శ్రద్ధగా చదువుకుని మంచి ఉద్యోగాలు సాధించి తల్లిదండ్రులకు పేరు తేవాలని మున్సిఫ్ మేజిస్ట్రేట్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి మహ్మద్ అసదుల్లా షరీఫ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. ఎవరైన ఆకతాయిలు ఇబ్బందులకు గురిచేస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, 100 నంబరుకు డయల్ చేయాలని అన్నారు. అనంతరం విద్యార్థులకు బాలికల హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కారుకూరి సరేందర్, సీనియర్ న్యాయవాదులు భూమారెడ్డి, నళిని కాంత్, న్యాయవాదులు ఆర్.ప్రకాశం, సత్యం, గణేష్, వినీత, ప్రిన్సిపాల్ గఫార్ పాల్గొన్నారు.

అద్దెకు డీలర్‌షిప్!



జిల్లా కేంద్రం మంచిర్యాలలోని ఓ రేషన్ దుకాణంలో అధికారుల తనిఖీలు

- రేషన్ దుకాణాల్లో బినామీల తిష్ట
- పేరొకరిది.. నిర్వహణ మరొకరిది..
- జిల్లాలో చాలా చోట్ల ఇతరుల చేతుల్లోనే..
- తనిఖీల్లోనూ పట్టుబడకుండా 'మేనేజ్'

సాక్షిప్రతినిధి, మంచిర్యాల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.వేల కోట్లు ఖర్చు చేస్తున్న ప్రజాపంపిణీ వ్యవస్థలో చాలా చోట్ల బినామీల హవా సాగుతోంది. నిబంధనల ప్రకారం ఎంపిక చేసిన రేషన్ డీలర్లే సరుకులు పంపిణీ చేయాల్సి ఉంటుంది. ఇందుకోసం డీలర్లకు కమీషన్ చెల్లిస్తోంది. గతంలో ప్రతీ క్వింటాల్‌కు రూ.70 ఉండగా, ప్రస్తుతం రూ.140 ఇస్తున్నారు. అర్హత లేకున్నా చాలా చోట్ల బినామీల చేతుల్లోనే రేషన్ దుకాణాలు ఉన్నాయి. గతంలో ఆఫ్‌లైన్‌లో అంతా పేపర్లలోనే ఏదో రాసేస్తూ కథ నడిపించేవారు. అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు వేలిముద్రల ఆధారంగా డీలర్, లబ్ధిదారుల బయోమెట్రిక్‌తోనే చేస్తున్నారు.

Forwarded
రేపు మన మంచిర్యాల... లో తనిఖీ ఉంటుంది....
అందరూ అన్ని సరి చేసుకొని ఉంచుకోగలరు....

తనిఖీలు ఉన్నాయంటూ వాట్సాప్ మెసేజ్

బయోమెట్రిక్‌కు ముగ్గురికి అవకాశం

ప్రతీ రేషన్ దుకాణంను డీలర్‌తోపాటు మరో ఇద్దరు వేలిముద్రలతో నిర్వహించవచ్చు. ఏ కారణంగానైనా డీలర్‌కు వీలు కాకపోతే, తన కుటుంబ సభ్యులు కూడా నిర్వహించేలా అవకాశమిచ్చారు. దీన్ని ఆసరా చేసుకుని ఆ ఇద్దరి స్థానంలో బినామీల వేలిముద్రలు నమోదు చేయించి ఏళ్లకేళ్లుగా రేషన్ దుకాణాలు అద్దెకు ఇస్తున్నారు.

దుకాణాన్ని బట్టి లీజు ధర

రేషన్ షాపుల్లో లబ్ధిదారుల సంఖ్య, బియ్యం అలాట్‌మెంటును బట్టి లీజు తీసుకుంటున్నారు. పెద్ద దుకాణం అయితే రూ.10వేలు నుంచి రూ.15వేల వరకు, కొన్ని చోట్ల రూ.7, రూ.8వేలకు కూడా నెలకు లీజు ఇస్తున్నారు. కమీషన్, గన్నీ సంచులు అన్ని బినామీలే తీసుకుంటున్నారు. చాలా చోట్ల లబ్ధిదారులు దొడ్డు బియ్యం అన్నం తినేందుకు ఇష్టపడక డీలర్లకే అమ్మేస్తున్నారు. రాజకీయంగా పలుకుబడి ఉన్న డీలర్లు, సంఘ నాయకులుగానూ ఉండడంతో అధికారులు కఠిన చర్యలు తీసుకోలేకపోతున్నారు.

జిల్లాలో	
రేషన్ దుకాణాలు	423
రేషన్ కార్డులు	2,19,184
లబ్ధిదారులు	6,38,790

నిరుద్యోగులకు ఇస్తే మేలు

బినామీలను ఏరివేసి స్థానిక నిరుద్యోగ యువతకు అవకాశం ఇస్తే మేలు జరిగే అవకాశం ఉంది. కాంగ్రెస్ సర్కారు అనర్హులకు డీలర్ షిప్ తొలిగించాలని, బినామీలను ఏరివేయాలని ఆదేశాలిచ్చింది. క్షేత్రస్థాయిలో తనిఖీలు నామమాత్రంగా జరుగుతున్నాయి. తనిఖీలకు ముందే పలానా చోటుకు పౌరసరఫరాల శాఖ అధికారులు వస్తున్నారనే మేసేజ్‌లు వాట్సాప్‌లో వెళ్తున్నాయి. దీంతో అంతా సెట్ చేసుకుంటున్నారు. అధికారులు సైతం అంతా బాగుందనే రికార్డుల్లో రాసుకుని వెళ్లిపోతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. బినామీల ఏరివేతపై జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి వాజిద్‌ను ఫోన్‌లో సంప్రదించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

బయటపడని బినామీలెందరో..

జిల్లా కేంద్రంలో పాత మంచిర్యాల పరిధిలో ఓ మహిళ పేరుతో రేషన్ షాపు ఉంది. ఆమెకు వివాహమై స్థానికంగా ఉండడం లేదు. కానీ ఆమె పేరుతోనే రేషన్ షాపు నడుస్తోంది. తెలిసిన వారికి నెల నెలా లీజుకు ఇచ్చి యథావిధిగా నిర్వహిస్తున్నారు.

- జిల్లా కేంద్రంలోని హమాలీవాడలో ఓ మహిళ పేరుతో షాపు ఉంది. ఆమె ఆ దుకాణాన్ని తన చెల్లెకు అప్పగిస్తే, కొన్నేళ్లుగా ఆమె చెల్లెలు నిర్వహిస్తున్నా పౌరసరఫరాల శాఖ అధికారులకు అస్సలు కనిపించడం లేదు.
- జిల్లా కేంద్రంలో మరో రెండు రేషన్ షాపులు సైతం లీజు పేరుతో వేరే వ్యక్తుల చేతుల్లో ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి.
- జైపూర్ మండలంలోని ఓ గ్రామంలోనూ ఓ మహిళ డీలర్ పెళ్లి చేసుకుని వెళ్లిపోగా, ఆమె స్థానంలో వేరేవాళ్లు దుకాణం నిర్వహిస్తున్నారు.
- జైపూర్ మండలంలో ఓ డీలర్ ఎప్పుడో డీలర్ షిప్ వదిలేశాడు. దుకాణం మాత్రం తనకు తెలిసిన వారికి అప్పగించి ఆయన వేరే వ్యాపారాల్లో స్థిరపడ్డారు.
- హాజీపూర్ పరిధిలో ఓ యువతి పేరుతో షాపు ఉంది. ఆమె పెళ్లి చేసుకుని వేరే చోటుకు వెళ్లిపోగా, ఇంకా ఆమె పేరుతోనే తండ్రి నడిపిస్తున్నారు. దీనిపై అప్పట్లో ఫిర్యాదు వెళ్లినా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించారు. జిల్లా వ్యాప్తంగా అనేక దుకాణాల్లో బినామీ రేషన్‌డీలర్లు తిష్ట వేసి ఏళ్లుగా రాజ్యమేలుతున్నా పట్టింపు కరువైందనే ఆరోపణలు ఉన్నాయి.

బాలికలకు చట్టాలపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న జడ్జి అర్పిత మారంరెడ్డి

మంచిర్యాలక్రైం: బాలికలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని స్థానిక జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి అర్పిత మారంరెడ్డి అన్నారు. జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం జిల్లా కేంద్రంలోని బీసీ వెల్ఫేర్ బాలికల వసతిగృహంలో బాలికల సంరక్షణ, చట్టాలు, హక్కులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలపై అఘాయిత్యాల పట్ల అప్రమత్తంగా ఉండాలని అన్నారు. విద్య ద్వారా సమాజంలో అసమానతలు తొలగిపోతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు ఎండీ.సంధాని, తాజొద్దీన్, సదయ్య, ఆర్‌ఆర్ రాములు, బార్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో రాణించాలి

- జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్

మంచిర్యాలఅగ్రికల్చర్: బాలికలు విద్యతోపాటు అన్ని రంగాల్లో రాణిస్తూ ఉన్నత శిఖరాలు అధిరోహించాలని, అందరికీ ఆదర్శంగా నిలువాలని జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ అన్నారు. జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం నస్పూర్‌లోని సమీకృత కలెక్టరేట్‌లో జిల్లా స్త్రీ, శిశు, వయోవృద్ధులు, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో జిల్లా సంక్షేమశాఖ అధికారి చిన్నయ్య, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శేషాద్రి, విద్యాశాఖ అధికారి ఎస్.యాదయ్యలతో కలిసి పాల్గొన్నారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ 'బాలికలను రక్షిద్దాం-బాలికలను చదివిద్దాం' కార్యక్రమంలో భాగంగా బాలికల సంరక్షణకు ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతోందని, బాలికలకు అవకాశం ఇస్తే అన్ని రంగాల్లో అద్భుతంగా రాణించి ఆకాశాన్ని అందుకుంటారని అన్నారు. అనంతరం జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాలలో 'వాల్యూ ఆఫ్ గర్ల్ చైల్డ్' అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి బాలల పరిరక్షణ సమితి చైర్మన్ వాహిద్, అధికారులు పాల్గొన్నారు.

మరింత చదువు.. సం'క్షేమం'



స్టడీ అవర్స్‌లో చదువుకుంటున్న పదో తరగతి విద్యార్థులు

- గురుకులాల్లో అదనపు తరగతులు
- విద్యార్థులకు పౌష్టికాహారం

బెల్లంపల్లి: ప్రస్తుత విద్యాసంవత్సరంలో వార్షిక పరీక్షలకు సిద్ధమవుతున్న పదో తరగతి, ఇంటర్మీడియెట్ విద్యార్థులపై ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ప్రత్యేక దృష్టి సారించింది. వంద శాతం ఉత్తీర్ణత సాధించాలనే లక్ష్యంతో ఓ వైపు మెరుగైన విద్యాబోధన చేస్తూనే మరోవైపు విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహిస్తోంది. వార్షిక పరీక్షలు సమీపిస్తుండడంతో విద్యార్థుల స్టడీ అవర్స్ పెంచారు. సాధారణ రోజులకన్నా ప్రస్తుతం రెండున్నర గంటలపాటు అదనంగా విద్యాభ్యాసం చేస్తున్నారు. ఈ కారణంగా విద్యార్థుల్లో నీరసం ఆవరించకుండా పౌష్టికాహారం అందించాలని సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి నవీన్ నికోలస్ నిర్ణయం తీసుకున్నారు. రెండ్రోజుల క్రితం ఉత్తర్వులు వెలువడడంతో బలవర్ధకమైన ఆహార పదార్థాలను విద్యార్థులకు అందిస్తున్నారు. దీంతో రెట్టింపు ఉత్సాహంతో విద్యార్థులు పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు.

ఆదిలాబాద్ రీజియన్ పరిధిలో...

ఆదిలాబాద్ రీజియన్ పరిధిలో మంచిర్యాల, ఆదిలాబాద్, కుమురంభీం జిల్లాలు ఉన్నాయి. వీటి పరిధిలో 17 ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాలు ఉన్నాయి. బాలబాలికల కోసం వేర్వేరుగా గురుకుల విద్యాలయాలు ఏర్పాటు చేసి ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలకు తీసిపోకుండా ఉన్నత ప్రమాణాలతో విద్యాభ్యాసం చేస్తున్నారు. ఈ కారణంగా యేటా పదో తరగతి, ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్ష ఫలితాల్లో సంక్షేమ గురుకులాల విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధిస్తూ ప్రతిభను చాటుకుంటున్నారు. ఈసారి కూడా ఉత్తమ ర్యాంకులు సాధించాలనే పట్టుదలతో ప్రత్యేక ప్రణాళిక తయారు చేసి గురుకుల విద్యాలయాల సంస్థ ముందుకు నడిపిస్తోంది.

పెరిగిన స్టడీ అవర్స్

సాధారణంగా గురుకుల విద్యార్థులకు రోజువారీగా ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1:15 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4:30గంటల వరకు విద్యాబోధన జరుగుతుంది. రాత్రి 7:30 గంటలకు స్టడీ అవర్స్ ప్రారంభించి 9 గంటలకు ముగిస్తారు. వార్షిక పరీక్షలు దగ్గర పడడంతో పదో తరగతి, ఇంటర్మీడియెట్ విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించడం కోసం ప్రత్యేకంగా ఇటీవల స్టడీ అవర్స్ పెంచి అమలు చేస్తున్నారు. రోజుకు అదనంగా రెండున్నర గంటల స్టడీ అవర్స్ పెంచారు. ఉదయం 6 గంటల నుంచి 7:30 గంటల వరకు, రాత్రి 9 గంటల నుంచి 10 గంటల వరకు సమయాన్ని పెంచారు.

సంక్షేమ గురుకుల విద్యార్థుల వివరాలు

ఆదిలాబాద్ రీజియన్‌లోని సంక్షేమ గురుకులాలు : 17
పదో తరగతి వార్షిక పరీక్షలకు సిద్ధమవుతున్న వారు : 1,295
పరీక్షలకు సిద్ధమవుతున్న ఇంటర్ ఫస్టియర్ విద్యార్థులు : 1,094
ఇంటర్ సెకండియర్ విద్యార్థులు : 940

పౌష్టికాహారం అందిస్తున్నాం



పదో తరగతి, ఇంటర్మీడియెట్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధనకు ప్రణాళికబద్ధంగా వ్యవహరిస్తున్నాం. అదనంగా స్టడీ అవర్స్ పెంచారు. విద్యార్థులకు అదనంగా పౌష్టికాహారం అందించడం జరుగుతోంది. విద్యార్థులు అలసిపోకుండా చదువుకుంటున్నారు.
– ఐనాల సైదులు, సీఓఈ ప్రిన్సిపాల్, బెల్లంపల్లి

విద్యార్థుల్లో సత్తువ కోసం..

రోజువారీ విద్యాబోధనతోపాటు అదనపు స్టడీ అవర్స్‌తో విద్యార్థులపై భారం పడే అవకాశాలు లేకపోలేదు. తద్వారా ఆరోగ్యపరంగా బలహీనంగా ఉన్న విద్యార్థుల్లో నిస్సత్తువ ఆవరించే అవకాశాలు ఉంటాయి. ఆరోగ్యంపై ప్రభావం పడకుండా చదువుకోవాలనే సదుద్దేశంతో సంక్షేమ గురుకులాల కార్యదర్శి నవీన్ నికోలస్ రోజువారీ ఆహారానికి తోడు స్టడీ అవర్స్ దృష్ట్యా పౌష్టికాహారం అందించాలని సంకల్పించారు. తక్షణంగా శక్తినిచ్చే డ్రైఫ్రూట్స్, రాగి జావా, మిల్లెట్ బిస్కెట్స్, కోడిగుడ్డు వంటి అదనపు ఆహారం అందించేందుకు ఆదేశాలు జారీ చేశారు. ప్రత్యేకంగా నిధులు మంజూరు చేశారు.

ముగిసిన ధాన్యం కొనుగోళ్లు

- లక్ష్యం చేరని సేకరణ
- గతేడాది కంటే 20 వేల మెట్రిక్‌టన్నులు తక్కువ
- 42 మిల్లులకు తరలింపు



కొనుగోలు కేంద్రంలో ధాన్యం తూకం

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో వానాకాలంలో సాగు చేసిన ధాన్యం సేకరణ ముగిసింది. దీంతో కొనుగోలు కేంద్రాలు ఎత్తివేయగా.. రైతులకు నగదు చెల్లించాల్సి ఉంది. ట్యాబ్ ఎంట్రీ జాప్యం కారణంగా నగదు జమ ఆలస్యం అవుతున్నట్లు తెలుస్తోంది. ఈ ఏడాది సన్న రకం ధాన్యంతోపాటు దొడ్డు రకానికి బహిరంగ మార్కెట్‌లో ధర ఎక్కువగా ఉండడంతో వ్యాపారులు రైతుల పొలాల వద్దనే కొనుగోలు చేశారు. ధాన్యం సేకరణ లక్ష్యంలో 60శాతం కొనుగోలు కేంద్రాలకు వచ్చింది. సాగు విస్తీర్ణానికి అనుగుణంగా కొనుగోలు కేంద్రాలు పెంచినా ఆశించిన మేరకు ధాన్యం సేకరించలేదు. గత ఏడాది కంటే 20వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు కేంద్రాలకు తక్కువగా వచ్చింది. ఈ ఏడాది 1,39,869.760 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సేకరించారు. 22,326 మంది రైతుల నుంచి కొనుగోలు చేయగా రూ.308,13,08,783 నగదు అందాల్సి ఉంది. ఇప్పటివరకు 1,36,915.718 మెట్రిక్ టన్నుల ధాన్యం మిల్లులకు తరలించి ట్యాబ్‌లో ఎంట్రీ చేశారు. 16,388 మంది రైతులకు రూ.235,79,83,001 నగదు ఖాతాలో జమ అయ్యింది. జిల్లాలో డీఆర్‌డీఏ 56, పీఏసీఎస్ 129, డీసీఎమ్మెస్ 90 కొనుగోలు ద్వారా ధాన్యం సేకరించారు. మిల్లులకు చేరిన ధాన్యం వివరాలు, నిర్వాహకులు ట్యాబ్ ఎంట్రీ పూర్తి స్థాయిలో చేస్తేనే రైతులకు ఖాతాలో నగదు జమ కానుంది.

డిసెంబర్‌లోనే పోటెత్తిన ధాన్యం..

జిల్లాలో నవంబర్ 10 నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించగా ఆశించిన మేర ధాన్యం రాలేదు. వర్షాభావ పరిస్థితుల కారణంగా వరి నాట్లు ఆలస్యం కావడంతో నవంబర్ నుంచి దిగుబడి రావాల్సిన పంట డిసెంబర్‌లో కోతకు వచ్చింది. ఆ నెలలో ధాన్యం పోటెత్తడంతో రైతులు, నిర్వాహకులు ఇబ్బందులు పడ్డారు. సరిపడా గన్నీ సంచులు, హమాలీలు, తూకం కాంటాలు, లారీలు అందుబాటులో లేక ఎదురు చూడాల్సి వచ్చింది. చలికాలం వాతావరణ పరిస్థితుల కారణంగా తేమ 17శాతం కన్న ఎక్కువగా రావడంతో కళ్లాల్లోనే రోజులు తరబడి ఆరబోశారు. మరోవైపు అకాల వర్షంతో కొన్ని మండలాల్లో ధాన్యం తడిసిపోయి నిర్వాహకులపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

లక్ష్యంలో 60 శాతం సేకరణ

జిల్లాలో 1.57 లక్షల ఎకరాల్లో వరి సాగు కాగా రైతుల అవసరాలకు పోను 2.15 లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా కొనుగోలు కేంద్రాలు, గన్నీ సంచులు, కాంటాలు తదితర ఏర్పాట్లు చేశారు. 273 కొనుగోలు కేంద్రాల్లో 1,39,868.760 మెట్రిక్‌టన్నుల ధాన్యం సేకరించారు. సేకరణ లక్ష్యంలో 60 శాతమే కొనుగోలు చేశారు. గతేడాది కంటే సాగు విస్తీర్ణం పెరగడం, మద్దతు ధర పెరగడం, దొడ్డురకం ధాన్యం సాగు రైతులు ఎక్కువగా చేశారు. ఏ గ్రేడు రకానికి క్వింటాల్‌కు రూ.2203 కాగా, సాధారణ రకానికి రూ.2183 ధరతో కొనుగోలు చేశారు.

ఇబ్బందులు లేకుండా ముగింపు

జిల్లాలో వివిధ సంస్థల ద్వారా 273 కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు చేపట్టాం. డిసెంబర్‌లో ధాన్యం పోటెత్తింది. వాతావరణ పరిస్థితు వల్ల తేమ ఎక్కువగా రావడం, వర్షాలతో కొంత రైతులు ఇబ్బంది పడ్డా.. తీసుకొచ్చిన ప్రతీ ధాన్యం గింజ కొనుగోలు చేశాం. ట్యాబ్‌లో ఎంట్రీ చేసిన ధాన్యం నగదు రైతుల ఖాతాల్లో జమ అవుతోంది.
– గోపాల్, జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజర్

విపత్తులపై తక్షణమే స్పందించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ బి.సంతోష్, సమావేశంలో పాల్గొన్న అధికారులు

- జిల్లా కలెక్టర్ బి.సంతోష్

మంచిర్యాలఅగ్రికల్చర్: ప్రకృతి విపత్తుల సమయంలో అన్ని శాఖల అధికారులు తక్షణమే స్పందించాలని, బాధితులకు అవసరమైన సహాయక చర్యలు అందించేందుకు సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ బి.సంతోష్ అన్నారు. నస్పూర్‌లోని సమీకృత కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్లు రాహుల్, మోతిలాల్, ఎన్‌డీఆర్‌ఎఫ్ విజయవాడ 10బెటాలియన్ ఇన్‌స్పెక్టర్ టీహెచ్ బిటెన్‌సింగ్, మంచిర్యాల, బెల్లంపల్లి ఆర్డీవోలు రాములు, హరికృష్ణలతో కలిసి ప్రకృతి విపత్తులు, చేపట్టాల్సిన చర్యలపై జాతీయ విపత్తుల ప్రతిస్పందన దళం ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ విపత్తులు, వాటి వల్ల ఏర్పడే పరిస్థితులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. సీపీఆర్ ద్వారా తక్షణ వైద్య సహాయం అందించి ప్రాణాలు కాపాడవచ్చని, ప్రతి ఒక్కరూ సీపీఆర్ విధానం తెలుసుకోవాలని అన్నారు. వరదలు, అగ్నిప్రమాదాల సమయంలో తీసుకోవాల్సిన చర్యలు, ప్రమాదాలు జరిగినప్పుడు క్షతగాత్రులకు అధిక రక్తస్రావం కాకుండా నిలుపుదల చేసి ప్రాణాలు కాపాడే విధానంపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. విపత్తుల సమయంలో తోడ్పాటు అందించేందుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చే ఆపదమిత్రుల వివరాలు, గతంలో విపత్తులకు గురైన ప్రాంతాల వివరాలు సేకరించాలన్నారు. ఈ సమావేశంలో ఏసీపీ తిరుపతిరెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.యాదయ్య, ఎన్నికల తహసీల్దార్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

బీసీలు ఉద్యమించాలి

పాతమంచిర్యాల: బీసీల సామాజిక న్యాయ ఆకాంక్షలను దేశ రాజకీయాల ఎజెండాపైకి తీసుకొచ్చిన మహానుభావుడు కర్పూరీ ఠాకూర్‌సింగ్‌ను స్ఫూర్తిగా తీసుకుని ఉద్యమించాలని బీసీ సంఘాల నాయకులు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో తెలంగాణ బీసీ జాగృతి నాయకులు, బీసీ ఐక్యవేదిక నాయకులు కర్పూరీ ఠాకూర్‌సింగ్ శత జయంతిని బుధవారం జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. కర్పూరీ ఠాకూర్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. తెలంగాణ బీసీ జాగృతి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నరెడ్ల శ్రీనివాస్, బీసీ ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు వడ్డేపల్లి మనోహర్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బీసీ జాగృతి పట్టణ అధ్యక్షుడు వైద్యభాస్కర్, వర్కింగ్ ప్రెసిడెంట్ పొట్టాల మల్లేష్, ప్రధాన కార్యదర్శి బొలిశెట్టి లక్ష్మణ్, నాయిబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు కంది శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి చిలువేరు పున్నం, సామాజిక న్యాయవేదిక జిల్లా కన్వీనర్ రంగు రాజేశం, అఖిల గాండ్ల తేలికుల సంఘం జిల్లా అధ్యక్షుడు బుద్ధి చంద్రమౌళి పాల్గొన్నారు.

క్లుప్తంగా

యువకుడి అదృశ్యం


హరీష్

వేమనపల్లి: మండలంలోని ముక్కిడిగూడం గ్రామానికి చెందిన తలండి హరీష్ ఈ నెల 20వ తేదీన అదృశ్యమైనట్లు తండ్రి సురేష్ తెలిపారు. శనివారం ఉదయం బైక్‌పై వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబీకులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. యువకుడి మొబైల్ ఫోన్ సిగ్నల్ ఆధారంగా పోలీసులు హైదరాబాద్‌లో గాలిస్తున్నారు. యువకుడి ఆచూకీ తెలిస్తే 99493 92918, 84649 14704 నంబర్లకు సమాచారం ఇవ్వాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

బాలిక ప్రాణం తీసిన మూఢనమ్మకం!

వేమనపల్లి: వైద్య పరంగా ఎంత అభివృద్ధి సాధిస్తున్నా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలను మూఢనమ్మకాలు వీడడం లేదు. పాముకాటు వేస్తే సకాలంలో ఆస్పత్రికి వెళ్లకుండా భూతవైద్యుడి వద్దకు వెళ్లి ప్రాణాలు పోగొట్టుకున్నారు. మండలంలోని లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన చిన్నారి(4) మంగళవారం సాయంత్రం ఇంటి పక్కన మూత్ర విసర్జన చేసేందుకు వెళ్లగా పాముకాటు వేసింది. కుటుంబ సభ్యులు వేమనపల్లి 108 అంబులెన్స్‌కు ఫోన్ చేశారు. అంబులెన్స్ వచ్చేలోపు ఇరుగుపొరుగు మాటలు విని కుమురంభీం జిల్లా దహెగాం మండలం కొంచెల్లిలోని ఒక నాటువైద్యుడి వద్దకు వెళ్లారు. ఆ చిన్నారి ధరించిన వస్త్రాలకు రాళ్లు ముడివేసి ప్రైవేట్ వాహనంలో హుటాహుటిన చేరుకున్నారు. భూతవైద్యుడి వద్దకు వెళ్లే లోపే చిన్నారి మృతిచెందినట్లు తెలుస్తోంది. అప్పటికే చిన్నారి చనిపోయిందని, మృతదేహాన్ని ఎందుకు తీసుకువచ్చారని భూతవైద్యుడు తెలుపడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. ఇంటికి తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు.

క్రిస్టియన్ జేఏసీ చైర్మన్‌గా నోవాహు


నియామక పత్రం అందుకుంటున్న నోవాహు

లక్సెట్టిపేట: తెలంగాణ క్రిస్టియన్ జేఏసీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా చైర్మన్‌గా పట్టణానికి చెందిన కడమండ్ల నోవాహు ఎన్నికైనట్లు బుధవారం తెలిపారు. ఈ నెల 23వ తేదీన మంచిర్యాల పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నియామక పత్రం రాష్ట్ర చైర్మన్ రవికుమార్ అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నా పై ఉంచిన నమ్మకాన్ని కాపాడుతానని తెలిపారు. రాష్ట్ర కో కన్వీనర్ సారయ్య నాయకులు రత్నరాజు, న్యాయవాది మేదరి పాల్‌సన్, హనోక్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న విచారణ

జైనూర్(ఆసిఫాబాద్): జైనూర్ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో 2015- 16 సంవత్సరానికి సంబంధించి పాల ప్యాకెట్ల పంపిణీలో జరిగిన అవకతవకలపై బుధవారం వరంగల్ రీజినల్ జాయింట్ డైరెక్టర్ ఝాన్సీ లక్ష్మిబాయి విచారణ చేపట్టారు. మండల కేంద్రంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో కీలక ప్రతాలను పరిశీలించారు. ఈ నెల 22 నుంచి చేపట్టిన విచారణను త్వరలో పూర్తి చేసి ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఆమె తెలిపారు.

పట్టభద్రులే అధికం..



- ఎమ్మెల్యేల్లో ఇద్దరు డాక్టర్లు
- శ్రీమంతుడు చెన్నూర్ ఎమ్మెల్యే వివేకానంద్
- రాష్ట్రంలోనే మొదటి స్థానం

సాక్షి, మంచిర్యాలడెస్క్: రాష్ట్ర వ్యాప్తంగా గత నవంబర్‌లో జరిగిన ఎన్నికల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని పది అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. వీరిలో అధిక శాతం ఎమ్మెల్యేలు ఉన్నత విద్యనభ్యసించి పట్టాలు పొందిన వారే ఉన్నారు. ఇద్దరు వైద్యులు కూడా ఉండడం గమనార్హం. ఫోరం ఫర్ గుడ్‌గవర్నెన్స్ ఈ నెల 24న రాష్ట్రంలోని ఎమ్మెల్యేలకు సంబంధించిన సమాచారాన్ని విడుదల చేసింది. ఎన్నికల సంఘానికి సమర్పించిన అఫిడవిట్ల ఆధారంగా ఎమ్మెల్యేలపై ఉన్న కేసులు, విద్యార్హతలు, ఆస్తులు, వయస్సు వివరాలు వెల్లడించింది.

ఇద్దరు వైద్యులు

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని సిర్పూర్ నియోజకవర్గం నుంచి తొలిసారి బీజేపీ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన పాల్వాయి హరీష్‌బాబు ఎంఎస్ ఆర్థో అభ్యసించారు. కాగజ్‌నగర్‌లో సొంత ఆస్పత్రి ఉండగా.. కొంతకాలం వైద్యుడిగా పని చేశారు. చెన్నూర్ నుంచి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేగా ఎన్నికైన గడ్డం వివేకానంద ఎంబీబీఎస్ అభ్యసించారు. తండ్రి వారసత్వంగా రాజకీయాల్లోకి వచ్చిన ఆయన వ్యాపారంలో స్థిరపడ్డారు.

- బెల్లంపల్లి కాంగ్రెస్ ఎమ్మెల్యే గడ్డం వినోద్ బీకాం, మంచిర్యాల కాంగ్రెస్ ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు, ఆదిలాబాద్ బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ డిగ్రీ, ఖానాపూర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు ఎంఏ, బోథ్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్‌కుమార్, నిర్మల్ బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి బీఏ, ముధోల్ బీజేపీ ఎమ్మెల్యే రామారావు పవార్ బీఎస్సీ అభ్యసించారు. ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి విద్యార్హతలేవీ(నోఫార్మల్ ఎడ్యుకేషన్) పేర్కొనలేదు.

'సిరి'మంతుడు వివేక్



రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 119 మంది ఎమ్మెల్యేల్లో చెన్నూర్‌కు చెందిన ఎమ్మెల్యే వివేకానంద్ రూ.606.67 కోట్ల స్థిర, చరాస్తులతో మొదటి స్థానంలో ఉన్నారు. వంద కోట్లకు పైగా ఆస్తులున్న క్లబ్‌లో ఏడుగురు ఉండగా వివేకానంద్ టాప్‌లో ఉండడం గమనార్హం.

ఖానా'పూర్ ఎమ్మెల్యే'

ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు రాష్ట్రంలోనే అందరి కంటే పేద ఎమ్మెల్యే. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఎమ్మెల్యేల్లో ఆర్థిక స్థితి పరంగా పరిశీలిస్తే ఆయన వద్ద కేవలం రూ.24లక్షలు మాత్రమే ఆస్తులున్నట్లు అఫిడవిట్‌లో పేర్కొన్నారు. హరీశ్‌బాబు ఆస్తులు రూ.4.19 కోట్లు, వినోద్‌కు రూ.197.12, ప్రేంసాగర్‌రావుకు రూ.54.13, కోవ లక్ష్మికి రూ.2.31 కోట్లు, పాయల్ శంకర్‌కు రూ.7.5కోట్లు, జాదవ్ అనిల్‌కు రూ.1.93 కోట్లు, మహేశ్వర్‌రెడ్డికి రూ.32.84 కోట్లు, రామారావుపవార్‌కు రూ.20.14 కోట్లు ఉన్నాయి.

వెడ్మ బొజ్జుపైనే కేసులు ఎక్కువ



రాష్ట్ర వ్యాప్తంగా ఎమ్మెల్యేలపై పలు కేసులు నమోదయ్యాయి. ఆందోళనలు, ఎన్నికల నిబంధనల ఉల్లంఘనలు, భూకబ్జాలు, మోసం, చెక్‌బౌన్స్, మారణాయుధాలతో గాయపర్చడం తదితర కేసులు ఉన్నట్లు పేర్కొన్నారు. కేసుల పరంగా రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే రాజాసింగ్‌లపై అత్యధికంగా 89 చొప్పున కేసులతో మొదటి స్థానంలో ఉండగా.. ఉమ్మడి జిల్లాకు సంబంధించిన ఎమ్మెల్యేల్లో వెడ్మ బొజ్జు 52 కేసులతో రాష్ట్ర వ్యాప్తంగా మూడో స్థానంలో, జిల్లాలో మొదటి స్థానంలో ఉన్నారు. పాల్వాయి హరీశ్‌బాబుపై 9కేసులు, గడ్డం వినోద్‌పై 4, కొక్కిరాల ప్రేంసాగర్‌రావుపై 40, పాయల్ శంకర్‌పై 11, ఏలేటి మహేశ్వర్‌రెడ్డిపై 8, రామారావు పవార్‌పై 2 కేసులు ఉన్నాయి. గడ్డం వివేకానంద్, కోవ లక్ష్మి, జాదవ్ అనిల్‌కుమార్‌లపై కేసులేమీ లేవు.

సీనియర్ సిటిజన్ రామారావు పవార్



ఉమ్మడి జిల్లాలోని పది మంది ఎమ్మెల్యేల్లో ముధోల్ ఎమ్మెల్యే రామారావు పవార్ వయస్సు పరంగా సీనియర్ సిటిజన్. ఆయన వయస్సు 69 సంవత్సరాలు. పిన్న వయస్కులు వెడ్మ బొజ్జు.. ఆయన వయస్సు 37 సంవత్సరాలు. రాష్ట్ర వ్యాప్తంగా పరిశీలిస్తే అత్యధిక వయస్కులు బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి(74) కాగా, పిన్న వయస్కులు నారాయణపేట్ ఎమ్మెల్యే చిట్టెం పర్నికారెడ్డి(30) ఉన్నారు. హరీశ్‌బాబు(44), వివేకానంద(66), వినోద్(67), ప్రేంసాగర్‌రావు(63), కోవ లక్ష్మి(53), పాయల్ శంకర్(52), జాదవ్ అనిల్‌కుమార్(49), మహేశ్వర్‌రెడ్డి(54).

ఒకరి మృతికి కారణమైన నిందితుడికి రిమాండ్


వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీనివాస్

వాంకిడి: కెరమెరి మండలం ధనోరా కొలాంగూడ గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో వన్యప్రాణులను వేటాడేందుకు అమర్చిన విద్యుత్ తీగలకు తగిలి ఒకరి మృతికి కారణమైన వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. ధనోర కొలాంగూడ గ్రామానికి చెందిన సీడం కట్టి అనే వ్యక్తి సోమవారం సాయంత్రం 5గంటల ప్రాంతంలో అదే గ్రామానికి చెందిన సీడం భీము అనే వ్యక్తి ఇంటికి వెళ్లి(భీము ఇంట్లో లేకపోవడంతో) ఈ రోజు రాత్రి వేటకు రావాలని అతడి భార్య భీంబాయికి చెప్పి వెళ్లాడు. రాత్రి 9గంటల ప్రాంతంలో కట్టి చెప్పిన అటవీ ప్రాంతానికి భీము ఒంటరిగా బయలుదేరాడు. అప్పటికే విద్యుత్ తీగలు అమర్చి ఉండటంతో ఆ తీగలకు తగిలి భీము అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు సీడం కట్టిని అరెస్టు చేసి బుధవారం రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. సమావేశంలో కెరమెరి ఎస్సై విజయ్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

జీవితంపై విరక్తితో యువకుడి ఆత్మహత్య


రాజ్‌కుమార్ మృతదేహం

తాండూర్: జీవితంపై విరక్తితో ఓ యువకుడు బావిలోదూకి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన బుధవారం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్సై రాజశేఖర్ వివరాల ప్రకారం... మండల కేంద్రంలోని వాల్మీకినగర్‌కు చెందిన అబ్బర్ల రాజ్‌కుమార్ (20) తల్లి అబ్బర్ల దేవక్క నాలుగేళ్ల క్రితం అకాల మృతి చెందగా తొమ్మిది నెలల క్రితం తండ్రి రాజమల్లు ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లి తండ్రులను కోల్పోయిన రాజ్‌కుమార్ ఒంటరిగా ఉంటూ మానసికంగా కృంగిపోయాడు. బుధవారం సాయంత్రం ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన రాజ్‌కుమార్ వాల్మీకినగర్ శివారు ప్రాంతంలో ఉన్న పాడు బడిన బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రాజ్‌కుమార్ మృతిపై నానమ్మ అబ్బర్ల మల్లమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సబ్సిడీ గ్యాస్‌సిలిండర్లు స్వాధీనం


పట్టుకున్న గ్యాస్ సిలిండర్లతో రెవెన్యూ అధికారులు

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని పలు హోటళ్లలో అక్రమంగా వినియోగిస్తున్న సబ్సిడీ గ్యాస్ సిలెండర్లను బుధవారం రెవెన్యూ అధికారులు స్వాధీనపర్చుకున్నారు. పట్టణంలోని మున్నీ బార్ అండ్ రెస్టారెంట్‌లో ఐదు సిలిండర్లు, మున్నీ హోటల్‌లో ఏడు సబ్సిడీ సిలిండర్లు, కాకతీయ మెస్‌లో ఆరు సబ్సిడీ సిలిండర్లను స్వాధీనపర్చుకున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్లు విలేకరులకు తెలిపారు. ఈ దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్లు రాజ్‌కుమార్, శ్యాంలాల్, శ్రీనివాస్, ఆర్ఐ రాజేశ్ పాల్గొన్నారు.

మామిడిపిందె ఆకారంలో..


మామిడిపిందె ఆకారంలో కోడిగుడ్డు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఈ ఫొటోలో చూస్తుంది.. మామిడిపిందె అనుకుంటున్నారా.? అయితే మీరు పప్పులో కాదు కాదు.. తప్పులో కాలేసినట్లే.. అవును ఇది నిజం.. ఇది మామిడిపిందె కాదు.. మామిడి పిందె ఆకారంలో ఉన్న అసలు సిసలైన 'కోడిగుడ్డు'.. ఇది నమ్మాల్సిన నిజమే.. మామిడి పిందెలాంటి గుడ్డు కథలోకి వెళ్తే.. హాజీపూర్ మండలం గుడిపేట 13వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్ ఎదురుగా ఉన్న దుమ్మల శ్రీనివాస్‌యాదవ్ కిరాణంలో గురువారం ఈ మామిడిపిందె ఆకారంలో ఉన్న కోడిగుడ్డు కనిపించింది. అప్పుడే వచ్చిన కోడిగుడ్ల నిల్వను దుకాణంలో ఓ చోట పెడుతూ ఉండగా ఒక్కసారిగా గుడ్ల ట్రేలో తేడా కనిపించడంతో పరీక్షించి చూడగా కోడిగుడ్డు రూపం గమ్మత్తుగా అగుపించింది. కోడిగుడ్డు అచ్చంగా 'మామిడిపిందె' ఆకారంలో విచిత్రంగా కనబడటంతో ఆ గుడ్డును అంతా విచిత్రంగా చూస్తూ ఔరా.! ఇదేంటీ ఈ విచిత్రం సుమా.. అనుకోవడం కొసమెరుపు..

నైట్‌వాచ్‌మన్ పోస్టు భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్‌లో ఖాళీగా ఉన్న నైట్ వాచ్‌మెన్ పోస్టు భర్తీకి కాంట్రాక్టు పద్ధతిలో పనిచేసేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు డీఈవో యాదయ్య తెలిపారు. ఈనెల 25 నుంచి 30లోగా దరఖాస్తులను డీఈవో కార్యాలయంలో అందజేయాలన్నారు. జిల్లాకు చెందిన పురుష అభ్యర్థులు పదో తరగతి ఉత్తీర్ణులైన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ పిట్ కమిటీ ఎన్నిక


ఎన్నికైన పిట్ కమిటీ

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే 5 గనిలో సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన పిట్ కమిటీని ఎన్నుకున్నారు. బుధవారం గనిపై జరిగిన కార్యక్రమంలో అసోసియేషన్ బ్రాంచీ ఉపాధ్యక్షుడు ప్రవీణ్ కుమార్, బ్రాంచ్ సెక్రటరీ నక్క సుమన్ పాల్గొని నూతన కమిటీని ఎన్నుకున్నారు. పిట్ సెక్రటరీగా పృథ్వి, అసిస్టెంట్ పిట్ సెక్రటరీగా శ్రావణ్, అడ్వైజర్‌గా దేవేందర్ సాయిలు, జనరల్ షిఫ్ట్ ఇన్‌చార్జిగా అంజి, ఏ రిలే ఇన్‌చార్జిగా సుజిత్, బీ రిలేకు శంకర్ నియమించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అంద వెంకటేష్, లక్ష్మణ్, మురళి, వాసు, దేవి శ్రీనాథ్, రవిబాబు కోటేశ్వరరావు, డేవిడ్ పాల్గొన్నారు.

తండ్రి మందలించాడని యువతి బలవన్మరణం


బైకం కీర్తన(ఫైల్)

మంచిర్యాలరూరల్(హాజీపూర్): తండ్రి మందలించాడని కూతురు బలవన్మరణానికి పాల్పడిన సంఘటన హాజీపూర్ మండలంలో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం ... మండలం నర్సింగాపూర్ గ్రామానికి చెందిన బైకం కీర్తన(19) మంచిర్యాలలోని ఓ ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతోంది. కీర్తన గత కొంత కాలంగా చదువు పక్కనపెట్టి టీవీ చూడటం, మొబైల్ ఫోన్‌తో గడుపుతుండగా మంగళవారం ఉదయం తండ్రి కుమార్ మందలించాడు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన కీర్తన క్షణికావేశంలో ఇంట్లోని గుర్తు తెలియని పురుగుల మందుతాగింది. కుటుంబీకులు వెంటనే మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు హాజీపూర్ ఏఎస్సై చాంద్‌పాషా తెలిపారు.

దంపతులపై దాడి..

మందమర్రిరూరల్: మంచిర్యాల నుంచి ఆర్టీసీ బస్సులో దేవాపూర్ వెళ్తున్న దంపతులపై దాడి చేసిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చంద్రకుమార్ వివరాల ప్రకారం... భార్యాభర్తలు జ్యోతి, రాజశేఖర్ మంచిర్యాలలో బస్సు ఎక్కిగా సీటు విషయంలో జ్యోతితో ఓ మహిళ గొడవకు దిగింది. ఈ క్రమంలో ఆ మహిళ మందమర్రిలోని తన బంధువులకు ఫోన్‌లో సమాచారం ఇచ్చింది. మందమర్రి యాపల్ ప్రాంతానికి బస్సు రాగానే సదరు మహిళకు సంబంధించిన వ్యక్తులు బస్సెక్కి దంపతులపై దాడికి దిగారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు.

సింగరేణి ఉత్తమ ఉద్యోగులు వీరే


సంపత్


ఎం. మధుకర్

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలో విధి నిర్వాహణలో ప్రతిభ కనబరిచిన 18 మందిని కంపెనీ ఉత్తమ ఉద్యోగులుగా ఎంపిక చేసింది. వీరిని ఈనెల 26న నస్పూర్ గోదారికాలనీలోని ప్రాణహిత స్టేడియంలో జరిగే గణతంత్ర దినోత్సవ వేడుకల్లో సన్మానించనున్నారు. వీరిలో ఆర్కే 5 గని నుంచిలెశెట్టి మల్లేష్ హెచ్‌వోఎం, అయిడపు ధనుంజయ ఎలక్ట్రిషన్, ఆర్కే 6 గని నుంచి కందికొండ వంశీకృష్ణ మెకానిక్, జక్కుల ఎర్రన్న సపోర్టుమెన్, ఆర్కే 6 నుంచి ఒరుగంటి బ్రహ్మయ్య, ఎస్‌డీఎల్ ఆపరేటర్, సంగం శివకుమార్ సపోర్టుమెన్, ఆర్కే న్యూటెక్ గని నుంచి కోడిపుంజుల రాజయ్య హెచ్‌ఓఎం, కొంగ సత్తయ్య సపోర్ట్ మెన్, ఎస్ఆర్పీ 1 గని నుంచి కుక్క దేవానందం, ఫిట్టర్, చెలిమెల తిరుపతి కోల్‌కట్టర్, ఎస్సార్పీ 3,3ఏ గనిన ఉంచి అడెపు రాజమల్లు హెచ్‌ఓఎం, బత్తుల సతీశ్‌కుమార్, ఫిట్టర్, ఐకె 1 గని నుంచి కందుల శ్యాం కుమార్ సపోర్ట్ మెన్, కుక్కల రమేష్ కోల్‌కట్టర్, ఇందారం ఓపెన్ కాస్ట్ గని నుంచి బండారి శ్రీనివాస్ ఎలక్ట్రిషన్, జనగాం మధు జనరల్ మజ్దూర్, శ్రీరాంపూర్ ఓపెన్‌కాస్ట్ గని నుంచి భాస్కర్ రావు ఫిట్టర్, ఎస్ దేవానంద్, హెచ్‌ఓఎంలను ఎంపిక చేశారు.

ఉత్తమ సింగరేణియన్‌గా..

కంపెనీ వ్యాప్తంగా అన్ని ఏరియాల్లో నుంచి ఒక్కో ఉద్యోగిని, ఒక్కో అధికారిని ఉత్తమ ఉద్యోగిగా ఎంపిక చేసి కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయంలో సీఎండీ చేతుల మీదుగా సన్మానం చేస్తారు. ఇందులో భాగంగా శ్రీరాంపూర్ నుంచి ఉత్తమ సింగరేణియన్‌గా ఐకే 1ఏ గనికి చెందిన ఎం.మధూకర్, ఉత్తమ అధికారిగా శ్రీరాంపూర్ ఓసీపీకి చెందిన ఎన్నపురెడ్డి సంపత్ (డెప్యూటీ ఎస్ఎస్ఓ) లను ఎంపిక చేశారు.

మందమర్రి ఏరియాలో...


కుమ్మరి జెస్సీరాజ్


జె.నాగరాజ్

మందమర్రిరూరల్: రిపబ్లిక్ డే సందర్భంగా మందమర్రి ఏరియాలోని ఉత్తమ అధికారి, ఉద్యోగులను సింగరేణి యాజమాన్యం ఎంపిక చేసింది. ఏరియా నుంచి సింగరేణి వ్యాప్త ఉత్తమ అధికారిగా జె.నాగరాజ్ ఏజీఎం (ఈఅండ్ ఎండి) ఏరియాలో కేకే-5గనిలో జనరల్ మజ్దూర్‌గా విధులు నిర్వహించే కుమ్మరి జెస్సీరాజ్ ఉత్తమ సింగరేణియన్‌గా ఎంపికయ్యాడు. అలాగే ఏరియా ఉత్తమ ఉద్యోగులుగా ఎనగందుల వెంకటరాజం కోల్‌కట్టర్, పల్లె అంజిరెడ్డి ఎలక్ట్రిషియన్ (కాసిపేట గని), ఎంబడి అంజయ్య కోల్‌కట్టర్, వెంగల రాజన్న ఎస్‌డీఎల్ ఆపరేటర్ (కేకే-5), ఆవుల మహేష్ ఫిట్టర్, మహమ్మద్ అమీర్ ఖాన్ హెడ్ ఓవర్మన్ (శాంతిఖని), వైనాల సురేష్ హెడ్ ఓవర్మన్, గుడిమల్ల ధర్మేందర్ జనరల్ మజ్దూర్ (ఆర్కే ఓసీపీ), మల్యాల విజయ్‌కుమార్ ఈపీ ఆపరేటర్, సల్లం మహేష్ జనరల్ మజ్దూర్ (కేకే-ఓసీపీ), కల్వచర్ల శ్రీనివాస్ కోల్‌కట్టర్ (టింబర్ మెన్ ట్రైనీ), కనకం రమేష్ హెల్పర్ (కాసిపేట-2గని) ఉద్యోగులు ఎంపికయ్యారు.

దుబ్బగూడెంలో సర్వే అడ్డుకున్న గ్రామస్తులు


అధికారులతో వాదనకు దిగిన గ్రామస్తులు

కాసిపేట: గ్రామస్తులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా రెవెన్యూ, సింగరేణి అధికారులు సర్వేలు నిర్వహించడం ఏమిటని ప్రశ్నిస్తూ బుధవారం గ్రామస్తులు సర్వేను అడ్డుకున్నారు. కేకే ఓసీపీ నిర్వాసిత గ్రామం దుబ్బగూడెంలో అధికారులు ఇంటి స్థలాలు కాకుండా అదనంగా ఉన్న భూములను సర్వే చేస్తున్నారు. ముందస్తు సమాచారం లేకుండా తమ భూములు ఎలా చూపిస్తామని, ఇప్పటికే ఒక్కరి భూమి ఒక్కరు రాయించుకుని డబ్బులు తీసుకున్నారని, అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక్కరిద్దరి కనుసన్నల్లో అధికారులు ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తూ సామాన్యులకు అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. సర్వేను నిలిపివేస్తున్నామని రేపటి నుంచి సర్వే చేస్తామని అందరు సిద్ధంగా ఉండాల్సిందిగా తెలిపి అధికారులు వెళ్లిపోయారు. కార్యక్రమంలో ఎంఆర్ఐ సులోచన, సింగరేణి అధికారులు పాల్గొన్నారు.

పురుగుల మందుతాగిన యువకుడి మృతి

- మృతదేహంతో మహిళ ఇంటి ఎదుట ఆందోళన
- న్యాయం చేయాలని డిమాండ్
- పోలీసుల జోక్యంతో విరమణ


ఆందోళనకారులతో మాట్లాడుతున్న సీఐ రాజు

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని అశోక్ రోడ్‌కు చెందిన ఎండీ సల్మాన్(30) ఈ నెల 22న పురుగుల మందు తాగి బలవన్మరణానికి యత్నించగా వరంగల్‌లోని ఎంజీఎంలో చికిత్స పొందుతూ 23న మృతిచెందిన విషయం తెలిసిందే. సల్మాన్ మృతికి బండ రజిని కారణమంటూ ఆమె ఇంటి ఎదుట సల్మాన్ మృతదేహంతో కుటుంబ సభ్యులు బుధవారం ఆందోళనకు దిగారు. రెండు గంటల పాటు ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. విషయం తెలుసుకున్న స్థానిక సీఐ రాజు ఘటనా స్థలానికి చేరుకొని బాధితులతో మాట్లాడి ఆందోళన విరమింపజేశారు. సల్మాన్ మృతికి కారణమైన రజినిపై చట్టపరమైన చర్యలు తీసుకుని న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

బ్లాక్ మెయిల్‌కు పాల్పడుతోందని...

రజిని, సల్మాన్‌లు ఎనిమిదేళ్లుగా ప్రేమించుకున్నారని, ఈ క్రమంలోనే రజిని మరో వ్యక్తిని వివాహం చేసుకుంది. కొంతకాలం తరువాత అతడితో విడాకులు తీసుకుని సల్మాన్‌కు దగ్గరైంది. దీంతో రజిని కుటుంబ సభ్యులు గతంలో దాడికి సైతం పాల్పడ్డారు. దీంతో ఇరువురి పెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహించి ఇద్దరిని వేరుగా ఉండాలని నిర్ణయించారు. పెద్దల ఒప్పందాన్ని ధిక్కరించి ఇద్దరు మళ్లీ ఒక్కటయ్యారు. ఈ నేపథ్యంలో రజిని సల్మాన్‌ను బ్లాక్‌మెయిల్ చేస్తూ డబ్బులు డిమాండ్ చేయడంతో రూ.4లక్షలు ఇచ్చాడు. ఇంకా డబ్బులు కావాలని డిమాండ్ చేయడంతో ఇరువురి మధ్య మనస్పార్థలు వచ్చారు. రూ.2లక్షలు తీసుకురావాలని, లేకుంటే చచ్చిపోతానని రజిని బ్లాక్‌మెయిల్ చేయడంతో మనస్తాపానికి గురైన సల్మాన్ ఆత్మహత్యకు పాల్పడ్డాడని మృతుడి పెద్దమ్మ గౌషియ పేర్కొంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ రాజు తెలిపాడు.

గణతంత్ర దినోత్సవ వేడుకలకు ఏర్పాట్లు


ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్వోటూ జీఎం


సూచనలు చేస్తున్న జీఎం మనోహర్

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియా సింగరేణి యాజమాన్యం ఆధ్వర్యంలో నిర్వహించే గణతంత్ర దినోత్సవ వేడుకల నిర్వహణకు భీమన్న స్టేడియంలో అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నామని ఎస్వోటూ జీఎం నరేందర్ అన్నారు. గోలేటి టౌన్‌షిప్‌లోని భీమన్న స్టేడియంలో గణతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవ వేడుకలకు గోలేటి, మాదారం టౌన్‌షిప్‌ల నుంచి పెద్ద మొత్తంలో ఉద్యోగులు, ఉద్యోగుల కుటుంబ సభ్యులు హాజరయ్యేలా చూడాలని అధికారులకు సూచించారు. వేడుకల నిర్వహణకు కావాల్సిన అన్ని రకాల ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు. వేడుకల్లో భాగంగా నిర్వహించే ఉత్తమ ఉద్యోగుల సన్మానాలు, సాంస్కృతిక కార్యక్రమాలను అంగరంగ వైభవంగా నిర్వహించాలని అన్నారు. అన్ని విభాగాలు సమన్వయంతో పని చేసి వేడుకలకు ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

పనులు పరిశీలన

మందమర్రిరూరల్: ఏరియాలో ఈనెల 26 రిపబ్లిక్ డే వేడుకలకు సింగరేణి హైస్కూల్ మైదానంలో యాజమాన్యం ఏర్పాటు చేస్తోంది. బుధవారం ఏరియా జీఎం మనోహర్ అధికారులతో కలిసి హైస్కూల్ మైదానాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఏరియా పర్సనల్ మేనేజర్ సల్ల శ్యాంసుందర్, అధికారులు ఆసీఫ్, జయప్రకాశ్, గుర్తింపు సంఘం (ఏఐటీయూసీ) బ్రాంచ్ కార్యదర్శి సత్యనారాయణ ఉన్నారు.

పోస్టుల భర్తీకి పరీక్షలు


పర్యవేక్షిస్తున్న ఎస్ఓటూ జీఎం రఘుకుమార్

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలో ఖాళీగా ఉన్న మున్సీ, హెడ్‌చైన్‌మెన్, అసిస్టెంట్ చైన్‌మెన్, డంప్‌మెన్, ట్రిప్‌మెన్‌పోస్టుల భర్తీకి ప్రాక్టికల్, రాత పరీక్షలు బుధవారం నిర్వహించారు. అంతర్గత ఉద్యోగులతో వీటిని భూర్తి చేస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం శ్రీరాంపూర్ ఎంవీటీసీలో వీటికి సంబంధించిన రాత పరీక్షలు, ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలను ఏరియా ఎస్ఓటూజీఎం రఘుకుమార్ పరిశీలించారు. పరీక్షలు పూర్తి పారదర్శంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతిభ ఆధారంగా అభ్యర్థుల ఎంపిక ఉంటుందని తెలిపారు. డీజీఎం(పర్సనల్) అరవిందరావు, డీజీఎం(ఐఈడీ) చిరంజీవులు, ఏరియా సర్వే అధికారి వెంకటేశం, డీవైపీఎం రాజేశ్వర్‌రావు, సీనియర్ అసిస్టెంట్ అరుంధతి పాల్గొన్నారు.